క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, వంకాయ 18, బెండ 45, పచ్చి మిర్చి 45, కాకర 45, బీర 45, క్యాబేజి 13, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 17, దొండ 35, చిక్కుడు 65, గోకర 50, బీట్‌రూట్ 15, క్యాప్సికం 45, ఆలు 18, దోస 28, సొర 11, పొట్ల 15, ఉల్లి 14 చామగడ్డ 55 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

యూటర్న్ ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ డీసీపీకి వినతి

లింగోజిగూడ: మాల్ మైసమ్మ ఫ్లైఓవర్ ప్రారంభం అనంతరం కాలనీలలోకి వెళ్లేందుకు వీలు లేకుండా ఎల్‌బీనగర్ వద్ద యూటర్న్ మూసి వేశారని వెంటనే దాన్ని పునరుద్ధరించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి కోరారు. ఎల్‌బీనగర్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ... ఎల్‌బీనగర్ కాకతీయ కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ ఫేజ్ 1, 2, 3, శాతవాహననగర్ కాలనీ, సీఎం రోడ్డుకు వెళ్లాలంటే యూటర్న్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని డీసీపీకి వివరించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతల సురేందర్ యాదవ్, విజయభాస్కర్, కృష్ణం రాజు, శ్రీనివాస్, రామేశ్వర్, వెంకటాచారి, గట్టు రవి, గణేష్, ధనరాజు పాల్గొన్నారు.

కొత్త డ్రైనేజీ పైప్‌లైన్లు నిర్మించాలి



జలమండలి జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో నూతన డ్రైనేజీ పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు జలమండలి జీఎం బలరామ్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన డ్రైనేజీ పైప్‌లైన్లు పెరుగుతున్న జనాభా అవసరాలకు ఏమాత్రం సరిపోక నిరంతరం నిండి మురుగు నీరు బయటకు పొంగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అన్ని కాలనీలలోని పాత డ్రైనేజీ పైప్‌లైన్లన్నింటినీ వర్షాకాలం ప్రారంభం అయ్యేలోగా మార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాలనీలలో ప్రధాన సమస్యగా ఉన్న దాదాపు 20 చిన్నచిన్న డ్రైనేజీ లైన్లు మార్చాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, శరణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై సీపీఎం నిరసన



ఎన్టీఆర్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.గోపీనాయక్, కట్ట శ్రీనివాస్ నేతృత్వంలో శనివారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రజలను డిజిటల్ పేమెంట్‌ల వైపు మళ్లించి ప్రస్తుతం ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలపై చార్జీలు విధిస్తూ ప్రజలపై దోపిడీకి పాల్పడుతోందన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, నిత్యావసరాల ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందని విధంగా పెరిగిపోతున్నా వాటిని కట్టడి చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలం అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు వెంకటేష్ యాదవ్, యాదయ్య, పరమేష్, శంకర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

కాచిగూడ: కొద్ది రోజులుగా తాగునీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అధికారులకు విన్నవించారు. శనివారం జలమండలి ఏఈ భావనను కలిసిన కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. నారాయణగూడ రిజర్వాయర్‌లోని మెయిన్ వాల్వు చెడిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని వెంటనే వాల్వ్‌కు మరమ్మతులు చేయించాలన్నారు. బీజేపీ నేతలు కన్నె ఉమా రమేష్ యాదవ్, ప్రతిభ, భీమ్‌రాజ్, బాలప్రసాద్, ఎస్. రవియాదవ్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో...

ఎల్‌బీనగర్ జోన్‌కు అగ్రస్థానం

- 2022–23వ సంవత్సరంలో వసూళ్ల లక్ష్యం రూ. 262 కోట్లు
- వసూలైంది రూ. 259.06 కోట్లు
- గ్రేటర్ పరిధిలో ఎల్‌బీనగర్ జోన్ రికార్డు స్థాయిలో 98.88 శాతం వసూళ్లు
- 102 శాతం వసూళ్లు సాధించిన ఎల్‌బీనగర్, కాప్రా సర్కిళ్లు
- ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ





ఎల్‌బీనగర్: ఆస్తి పన్ను వసూళ్లలో 2022–23వ ఆర్థిక సంవత్సరానికిగాను జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఎల్‌బీనగర్ జోన్ ప్రథమ స్థానంలో నిలిచిందని జోనల్ కమిషనర్ పంకజ వెల్లడించారు. జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం రూ. 262 కోట్లు కాగా వచ్చిన ఆదాయం రూ. 259.06 కోట్లని వివరించారు. వసూళ్లలో 98.88 శాతం సాధించి ముందంజలో ఉందని జెడ్‌సీ పేర్కొన్నారు. గత సంవత్సరం కూడా ప్రథమ స్థానంలో ఉన్నామని గుర్తుచేశారు. ఐదు సర్కిళ్ల పరిధిలోని డీసీలు, రెవెన్యూ సిబ్బంది చేసిన కృషి కారణంగానే ఈ పురోగతిని సాధించామంటూ వారిని అభినందించారు. సమష్టిగా పనిచేసినందుకే గ్రేటర్ పరిధిలో ఎల్‌బీనగర్ జోనల్ ప్రథమ శ్రేణిలో ఉందన్నారు.

సర్కిళ్ల వారీగా వసూళ్ల వివరాలు...

- కాప్రా సర్కిల్ లక్ష్యం రూ. 52 కోట్లుకాగా రూ. 53.17 కోట్లు వసూలైంది. 102.24 శాతం వసూళ్లతో జోనల్‌లో రెండవ స్థానంలో ఉంది.
- ఉప్పల్ సర్కిల్ లక్ష్యం రూ. 37 కోట్లుకాగా రూ. 35 కోట్ల వసూలుతో 94.69 శాతం సాధించింది.
- హయత్‌నగర్ సర్కిల్‌లో ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం రూ. 62 కోట్లయితే రూ. 59.70 కోట్లు వసూలు చేసి 96.29 శాతం సాధించింది.
- ఎల్‌బీనగర్ సర్కిల్‌లో లక్ష్యం రూ. 49 కోట్లు కాగా రూ. 50.26 కోట్లు వసూలు చేసి 102.56 శాతంతో జోనల్ పరిధిలోనే కాకుండా గ్రేటర్‌లోనే అన్ని సర్కిళ్ల కంటే ముందంజలో ఉంది.
- సరూర్‌నగర్ సర్కిల్ వసూళ్ల లక్ష్యం రూ. 62 కోట్లు కాగా రూ. 60.91 కోట్లు వసూలు చేసి 98.24 శాతం లక్ష్యాన్ని సాధించింది అని జోనల్ కమిషనర్ పంకజ వివరించారు.

ఎర్లీబర్డ్ కింద వసూళ్ల లక్ష్యం రూ. 105.68 కోట్లు...

- ఎర్లీబర్డ్ పథకం కింది ఏప్రిల్‌లో ఆస్తి పన్ను చెల్లిస్తే పన్నులో రాయితీ ఉంటుందని ఇంటి యజమానులు అందరూ ఈ సౌకర్యాన్ని సద్వి నియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ పంకజ సూచించారు. ఏప్రిల్‌లో చెల్లిస్తేనే ఈ రాయితీ పొందవచ్చనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆమె స్పష్టం చేశారు.
- కాప్రా సర్కిల్ రూ. 24.29 కోట్లు, ఉప్పల్ సర్కిల్ రూ. 14.50 కోట్లు, హయత్‌నగర్ సర్కిల్ రూ. 23.54 కోట్లు, ఎల్‌బీనగర్ సర్కిల్ రూ. 20.17 కోట్లు, సరూర్‌నగర్ సర్కిల్ రూ. 23.18 కోట్ల వసూలు లక్ష్యంగా ఉంది అని జెడ్‌సీ పంకజ పేర్కొన్నారు. ఎర్లీబర్డ్ లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆమె సూచించారు.

అధికారం కోసం బీజేపీ అడ్డదారులు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: తెలంగాణలో అధికారాన్ని ఎలాగైనా సాధించేందుకు బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని, కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం హయత్‌నగర్‌లో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... బీజేపీ తన మూల సిద్ధాంతాలను పక్కన బెట్టి ప్రాంతానికో విధానాన్ని అవలంభిస్తోందని దుయ్యబట్టారు. ఎక్కడ ఎన్నికలు జరిగితే ఆ ప్రాంత ఓటర్లను ఆకర్షించేలా తమ సిద్ధాంతాలను మర్చుకుంటోందని తూర్పారబట్టారు. కర్ణాటకలో ఎన్నికలు జరుగుతున్నందున అక్కడ మెజారిటీ కులానికి చెందిన లింగాయత్‌లకు రిజర్వేషన్లు పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. కరోనా కాలంలో ప్రపంచ కుబేరులంతా ఆదాయాన్ని కోల్పోతే 609వ స్థానంలో ఉన్న అదానీ మాత్రం ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానానికి ఎలా చేరారని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ సంపదను అదానీకి దోచిపెట్టారని, దీనిపై సమాధానం చెప్పకుండా ప్రధాని తప్పించుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ ఎన్ని కుయుక్తులు చేసినా తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. నాలుగేళ్లలో ఎల్‌బీనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశామని, ఆక్సిజన్ పార్కులు, ఫ్లైఓవర్లు, స్కైవేల నిర్మాణంతో పాటు చాలా కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించామని ఆయన స్పష్టం చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు సామ తిరుమల్‌రెడ్డి, భాస్కర్‌సాగర్, భిక్షపతి, నక్క రవీందర్‌గౌడ్, మల్లేష్ ముదిరాజ్, ఉమాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా అవసరాలకు అనుగుణంగా వసతులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లో వెలుస్తున్న నూతన కాలనీల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతులను కల్పిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో అభివృద్ధి పనుల కోసం రూ. 5.25 కోట్లను మంజూరు చేశామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్పొరేటర్ సుజాతానాయక్ మాట్లాడుతూ... హనుమాన్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి 1.77 కోట్లు, భీమానగర్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.4 కోట్లు, నందనవనం శ్మశానవాటిక ఆధునికీకరణకు రూ. 93.61 లక్షలు, భూపేశ్‌గుప్తానగర్ కాలనీ శ్మశానవాటిక ఆధునికీకరణకు రూ. 47.30 లక్షలు, ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్–2 చైన్ లింక్ ఫెన్సింగ్ నిర్మాణానికి రూ. 4.70 లక్షలు, వెంకటేశ్వరకాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 9.20 లక్షలు, సరస్వతీ నగర్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ. 50 లక్షలు, హుడాభారతినగర్ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ. 25 లక్షలు మంజూరు చేయించామన్నారు. త్వరలో ఆయా పనులను ప్రారంభిస్తామన్నారు. పార్కులు శ్మశాన వాటికల్లో బోర్‌వెల్స్ ఏర్పాటుకు రూ. 4.70 లక్షలు, రంజాన్ నేపథ్యంలో మసీద్‌ల మరమ్మతులకు రూ. 4 లక్షలు మంజూరు చేశారని కార్పొరేటర్ వివరించారు.

పేదల సంక్షేమమే మజ్లిస్ లక్ష్యం

మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల



పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: పేద ప్రజల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా మజ్లిస్ పార్టీ ముందుకు సాగుతోందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. సైదాబాద్ మండల పరిధిలోని గడ్డిఅన్నారం పిల్లిగుడిసెవాసులకు 58 జీవో కింద మంజూరైన 23 పట్టాలను లబ్ధిదారులకు శనివారం పంజేషాహలోని కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బలాల మాట్లాడుతూ... పేదలకు పట్టాలు మంజూరు కావడంతో సంవత్సరాల తరబడి ఎదుర్కొంటున్న గుడిసెవాసుల సమస్యకు చెక్ పడిందన్నారు. పేదల పక్షాన నిలబడి సమస్యలు తీర్చడానికి ఎల్లప్పుడూ ముందుంటానని చెప్పారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేదలకు ఆయన సూచించారు. గుడిసెవాసులకు మౌలిక సదుపాయాలు మెరుగు పరచడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. సైదాబాద్ తహసీల్దార్ వేణుగోపాల్, నయాబ్ తహసీల్దార్ రాజు, పార్టీ నేతలు ఆంజనేయులు, బొజ్జప్ప, బాబు, ఓబులేషు, ఏసు, రంగన్న, శంకర్, వెంకటేష్, రవి, రాజు, మైలపాక రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా మలక్‌పేట అభివృద్ధి

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకొని ఆ దిశగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. శనివారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ట్రాన్స్‌కో, వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌లలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఆయా డివిజన్‌లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అధికారులు పర్యవేక్షిస్తుండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు షఫీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్



చాదర్‌ఘాట్: గ్రేటర్ హైదరాబాద్‌లో చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో ఫైర్ సేఫ్టీ నిబంధనలను కఠినతరం చేశామని జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. శనివారం మలక్‌పేటలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి వ్యాపారి, దుకాణదారు మే 31 నాటికి ఫైర్ నిబంధనలు విధిగా పొందాల్సిందేనని తెలిపారు. ఎలాంటి యూజర్ చార్జీలు లేకుండా ఆన్‌లైన్ ద్వారా జాహెచ్‌ఎంసీ వెబ్‌సైట్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకొని పొందాలని తెలిపారు. బహుళ అంతస్తుల భవనాల సెల్లార్‌లను వాహనాల పార్కింగ్‌కు తప్ప ఇతర వ్యాపార కార్యకలాపాలు వినియోగించరాదని డీసీ స్పష్టం చేశారు. ఈ విషయంలో నిబంధనలు పాటించని వారిపై దృష్టి సారించి కఠినంగా వ్యవహరించనున్నట్లు హెచ్చరించారు. బహుళ అంతస్తులలో అత్యవసర ద్వారాల సూచిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని, దారికి అడ్డంగా ఎలాంటి వస్తువులు ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పలు వ్యాపార సంస్థల యజమానులకు నోటీసులు అందజేసినట్లు ఆయన వివరించారు.

ఘనంగా దుర్గారాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం

మలక్‌పేట: మూసారంబాగ్ దుర్గా రాజరాజేశ్వరి త్రిశక్తి ఆలయ 7వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కొలువైన మూల మూర్తులకు అభిషేకం, చండీహోమం తదితర ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకంటి యాదగిరి, ప్రధాన కార్యదర్శి కాటపల్లి రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు మావురం నర్సింహా, విష్ణువర్ధన్‌యాదవ్, జంగారెడ్డి, విశాల్, జంగయ్యగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, మధు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ అధ్యక్షుడు యాదగిరి, రాజేశ్వర్‌రావు, సభ్యులు

సాయిబాబా ప్రతిమ ఆవిష్కరణ



బాబా ప్రతిమ ఆవిష్కరణలో పాల్గొన్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

చంపాపేట: రాజిరెడ్డినగర్ కాలనీలోని సాయిబాబా మందిరంలో శనివారం షిరిడీ సాయిబాబా ఆలయ పండిట్ సమక్షంలో ద్వారకామయి సాయిబాబా ప్రతిమ ఆవిష్కరణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్తా, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నరామ్మోహన్‌గౌడ్, ఉప్పల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చైతన్యపురి: తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల కోసం 58 జీవో ద్వారా పట్టాలు అందించినందుకు చైతన్యపురి డివిజన్ న్యూ ఇందిరానగర్ కాలనీ లబ్ధిదారులు శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాలనీలో ప్రతి ఒక్కరికీ పట్టాలు ఇప్పించారని కాలనీవాసులు తెలిపారు. ఇందుకు సహకరించిన బీజేపీ డివిజన్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తోట మహేష్‌యాదవ్‌లకు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నరేష్, వైస్ ప్రెసిడెంట్ కరుణాకర్, కరుణాకర్, నర్సింహా, శివ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరిగూడలో ఘనంగా మాతాజాగరణ్

చంచల్‌గూడ: ఆ ప్రాంతం మొత్తం అమ్మవారి నామస్మరణలతో మార్మోగింది. అమ్మవారి జాగరణ్ కార్యక్రమం ఆద్యంతం దేవీ నవరాత్రి ఉత్సవాలను తలిపించింది. జాగరణ్ నేపథ్యంలో ఉప్పరిగూడవాసులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ శ్రీరామభక్త సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రామాంజనేయ స్వామి ఆలయంలో ప్రారంభమైన మాతా జాగరణ్ శనివారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. భవసార్ క్షత్రియ సమాజ్ భజన బృందం అమ్మవారి కథ, భక్తి పాటలతో భక్తులను పరవశింపజేశారు. జాగరణ్‌కు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భవసార్ క్షత్రియ సమాజ్ రాష్ట్ర నాయకులు ఉమేశ్‌రావు జెత్నె, సభ్యులు మోహన్‌రావు, సైదాబాద్ కార్పొరేటర్ అరుణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నిరంజన్‌యాదవ్, పెరిక శ్రీనివాస్, రామ్‌పాల్, ధన్‌రాజ్, యాట ప్రమోద్, రాహుల్‌కిషోర్‌యాదవ్, రాజ్‌పాల్, శ్రీకాంత్, పెద్ది తదితనేలు పాల్గొన్నారు.

కేంద్రం నిధులను పక్కదోవ పట్టిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయ



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఆకుల విజయ

లింగోజిగూడ: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించి దుర్వినియోగం చేస్తోందని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు, కర్ణాటక రాష్ట్ర ఇంచార్జి ఆకుల విజయ ఆరోపించారు. మహిళా మోర్చా జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు శనివారం మన్సూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ... ఆయుష్మాన్ భారత్ పథకంలో ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకొని కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని, ఉన్న సిబ్బంది కూడా రోగులకు అందుబాటులో ఉండటం లేదన్నారు. దీంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వదిలి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సౌఖర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకురాళ్లు నందికొండ గీతారెడ్డి, మాలతి, లక్ష్మీప్రసన్న, కవిత, అరుణ, కల్యాణి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిర్లక్ష్యంతోనే ఉప్పల్ కారిడార్ పనుల్లో తీవ్ర జాప్యం

రామంతాపూర్: కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ కారిడార్ పనులు ఆలస్యం అవుతున్నాయని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి బత్తిని ప్రశాంత్‌గౌడ్ ఆరోపించారు. శనివారం ఉప్పల్ చౌరస్తాలో కారిడార్ పనులు ఆలస్యానికి నిరసనగా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్‌ఆర్‌డీపీ పథకం కింద వేగంగా రాష్ట్ర ప్రభుత్వం 35 ప్రాజెక్టులు పూర్తి చేసిందని, కేంద్ర ప్రభుత్వం కనీసం రెండు ప్రాజెక్టులు నిర్మించలేకపోతుందన్నారు. ఎలివేటెడ్ కారిడార్ పనులను మొదలుపెట్టి ఐదు సంవత్సరాలు నడుస్తున్నా ఇప్పటివరకు 40 శాతం పనులను కూడా కేంద్ర ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు.

'ఖేలో ఇండియా' పోటీల్లో సత్తాచాటిన నివేదిత



విద్యార్థినికి పతకాన్ని అందజేస్తున్న దృశ్యం

హస్తినాపురం: హస్తినాపురంలోని భవిష్య స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సెట్టిపల్లి నివేదిత జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఊషూ పోటీల జియాన్ షూ ఈవెంట్‌లో పతకాన్ని సాధించి సత్తాచాటుకుంది. మార్చి 27 నుంచి 31వ తేదీ వరకు జమ్మూకశ్మీర్‌లోని భగవతి ఇండోర్ హాల్‌లో జరిగిన ఖేలో ఇండియా ఊషూ సబ్ జూనియర్ విమెన్స్ లీగ్ పోటీల్లో నివేదిత ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించింది. తెలంగాణ రాష్ట్రానికి పతకాన్ని సాధించి పెట్టిన నివేదితను తెలంగాణ రాష్ట్ర ఊషూ సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఒమర్, రంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ ఊషూ సంఘం అధ్యక్షుడు జావీద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి సతీష్‌గౌడ్ తదితరులు అభినందించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో ప్రతిభకు పదును



సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

చంపాపేట: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కార్తీక్ అన్నారు. శనివారం చంపాపేట జనప్రియ రోడ్‌లోని సెయింట్ జార్జ్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టు, మోడల్ స్కూల్, అగ్నిపర్వతం, మానవ రక్త ప్రసరణ విధానం వంటి నమూనాలు సందర్శకులను అబ్బురపరిచాయి. అనంతరం పాఠశాల ఆవరణలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా చిన్నారులచే నిర్వహించిన బతుకమ్మ, బోనాలు, సంక్రాంతి, ఉగాది వంటి పలు పర్వదినాల వేడుకలు ఆకట్టుకున్నాయి.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్

చంపాపేట: వేసవిలో ఎండల తీవ్రం అవుతున్న నేపథ్యంలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు సేవాభావంతో ప్రధాన చౌరస్తాల్లో చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని మీర్‌పేట మున్సిపాలిటీ కార్పొరేటర్ బైగళ్ల బాలమణి అన్నారు. చంపాపేట చౌరస్తాలో స్థానికుడు బైగళ్ల రవీందర్ తన తల్లిదండ్రులు బాబయ్య, పొన్నమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆమె మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డితో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఆరె కృష్ణ, మాతంగి యాదగిరి, ఈశ్వరగుప్తా, గోపాల్, అర్జున్, మల్లేష్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్: వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళల నుంచి మిట్టల్ ఎక్సలెన్సి అవార్డ్స్–2023 నామినేషన్స్ కోసం సోనమ్ మిట్టల్ ఉమెన్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆహ్వానిస్తుందని ట్రస్ట్ ప్రతినిధి శివకుమార్ మిట్టల్ తెలిపారు. ఈ మేరకు శనివారం బొగ్గులకుంటలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాల్లోని ఎక్సలెన్సి ఇన్ జర్నలిజం, కల్చరల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అవార్డ్ ఫర్ ఫిజికల్లి చాలెంజ్‌డ్, హెల్త్‌కేర్ అండ్ నర్సింగ్, స్పోర్ట్స్, రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ డెవలప్‌మెంట్, రూరల్ ఏరియా తదితర రంగాల్లో నిష్ణాతులైన మహిళల నుంచి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులైన ఆసక్తిపరులు తమ నామినేషన్లను ఏప్రిల్ 21వ తేదీ లోగా పంపాలని కోరారు. వివరాలకు 91826 51734లో సంప్రదించాలని కోరారు.

బాధితులకు న్యాయం చేస్తా : ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: నాలా పరీవాహక ప్రాంతాల్లో నష్టపోతున్న బాధితులకు తోడ్పాటును అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం నల్లకుంట డివిజన్‌లో హుస్సేన్‌నగర్ నాలా విస్తరణలో నష్టపోతున్న బాధితులతో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని రత్నానగర్, దయానంద్‌నగర్‌లో ఉన్న నాలాతో భవన యాజమానులకు ప్రభుత్వం తరఫున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనిపై పారదర్శకంగా సర్వే చేయించి నివేదిక ఇవ్వా లని ఆయన అధికారులకు సూచించారు. అర్హులైన అందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సాయిబాబా, డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ అరుణ ఇతర అధికారులు, బస్తీ నాయకులు పాల్గొన్నారు.